# వెండి కుందులు

శ్రీ తెన్నేటి సూరి. బి. ఏ.

రాత్రి పదిగంటలు దాటింది. ప్రశాంతంగా వుంది, బౌద్ధ విహారం. చుట్టూ బౌద్ధ భిక్షువుల చలువరాతి విగ్రహాలు.

ఆ విహారానికి మధ్యగా గౌతమదేవుని చలువరాతి విగ్రహం ఒకటి వుంటుంది. చాలా పెద్దది. పాలరాతితో చెక్కబడివుంది. గౌతమదేవులు ఉపదేశముద్ర వహించినట్లుగా తీర్చాడు, శిల్పి. ఆ విగ్రహం ముఖంలో ప్రశాంతతను, చిత్రించేటందుకు, శిల్పి, తన యావత్తు ప్రతిభను వినియోగించినట్లుగా తోస్తుంది.

అ విగ్రహంముందు రెండువైపులా రెండు వెండి కుందులు వున్నాయి. వాటిలో రెండు ఆముదపుజ్యోతులు నిలిచి వెలుగుతూ వుంటాయి

ఆ విగ్రహానికి ఎదురుగా కరుణానంద భిక్షువు కూర్చుని చదువుకుంటూ వుంటాడు. ఆయనరూపం ఆ విగ్రహానికి ప్రతిమూర్తిగా వుంటుంది.

ఆయన ప్రక్కగా ఎనిమిది సంవత్సరముల బాలిక, దేవదత్త కూర్చుని చదువుకుంటూ వుంటుంది.

'తల్లీ! చాలా ప్రొద్దుపోయింది. నిద్ర నీ లేతకళ్ళ మీద బరువు లెత్తుతోంది. పో అమ్మా వెళ్లు. పడుకో."

దేవదత్తపుస్తకం భిక్షువుకు అందించి, దూరంగా వున్న పక్కమీదికి వెళ్ళి పడుకుంటుంది.

భిక్షువు చదువుకుంటూ వుంటాడు. ఆ తాళపత్ర గ్రంథంలో ఇలా వుంటుంది.—

"అది అయఃపిండ మంటివికద! మదీయ లలిత హృదయంబు చెంగట మెలగనిమ్ము. అయ్యది ద్రవీకరించిపోదా! ప్రశాంత కరుణవాహినిగా తూగి కదలిపోద."

తలుపు నెమ్మదిగా తెరువబడుతుంది. ఒక మనిషి తొంగిచూస్తాడు. మళ్లా మెల్లగా మూసివేస్తాడు.

కరుణానందభిక్షువు దీన్ని ఓరకంట గమనించుతాడు— గంభీరంగా 'భయం లేదు. రా లోపలికి', అంటాడు.

ఆ వ్యక్తి నెమ్మదిగా లోపలికి వస్తాడు—జిట్టబొచ్చు, పరిపుష్టకాయం- ఖూనీలు చేసేవాడిలా వుంటాడు. ఒంటినిండా గొంగళి కప్పుకుంటాడు. లోపలికివచ్చి, భయం భయంగా గదంతా చూస్తూవుంటాడు.

భిక్షువు:-ఏం?

వ్యక్తి:-ఇక్కడికి రాజభటు లెవ్వరూ రారుగదా?

భి:-రారు; భయం లేదు.

వ్య:-అట్టా అరచుకుంటావేం- నెమ్మదిగా మాట్టాడలేవూ?

భి:-అలానే; నెమ్మదిగానే మాట్లాడుతాను. ఇలా రా. కూర్చో.

ఆ వ్యక్తి వెళ్లి తలుపుగడియ గట్టిగా లాగి బిగించుతూ వుంటాడు. భిక్షువు అదిచూచి "ఏం?" అంటాడు.

వ్యక్తి:-ఎవడన్నా వస్తాడేమో?

భి:-రారు; అలా అడగకుండా లోపలికి రావటానికి వీలు లేదు. అల్లా గజగజ లాడకు. భయం లేదు. నీ ప్రాణానికి నాప్రాణం అడ్డుతాను.

ఆ వ్యక్తి భిక్షువువంక తదేకధ్యానంగా చూచి—

'నువ్వే పట్టిస్తావేమో?' అంటాడు సందేహంగా—

'నేనా!'

'ఏమో బాబూ! నాలిముచ్చులా మెత్తమెత్తగా మాట్లాడుతున్నావు. నిన్నుచూస్తే నాకు భయంవేస్తోంది. నేను వెళ్తాను' అని పోబోతాడు.

భిక్షువు "నా నెమ్మదికూడా నీకు తొందరనే కలిగించుతోందీ! అలా చేయను; ఆ నా పసిబిడ్డమీద ఒట్టు" అంటాడు—వ్రేలితో ఆ బిడ్డని చూపుతూ.

ఆ వ్యక్తి నిలబడిపోతాడు.

బిడ్డ పక్కమీద పడుకుని రెండు చేతులతోనూ ముఖం కప్పేసుకుని 'నాకు భయంవేస్తోంది బాబా!' అంటుంది.

'ఎందుకే అమ్మడూ, పిచ్చి తల్లీ!' అంటూ దగ్గిరికి పోయి కౌగలించుకుంటాడు, భిక్షువు.

బిడ్డ రహస్యంగా అతని చెవులో చెపుతుంది, "ఏడెవడో దొంగ[illegible]వాడిలా వున్నాడు. ఖూనీలు చేసేవాడిలా వున్నాడు. ఈ అర్ధరాత్రివేళ వీణ్ణి చేర్చావేమిటి.

చిరునవ్వునవ్వి, 'మరేం భయంలేదు పడుకో', అని ముద్దుబెట్టుకుంటాడు. మళ్లా ఆ నూతనపురుషుణ్ణి సమీక్షించుతాడు.

వ్యక్తి:-ఏమిటి చెబుతుంది- నన్ను పట్టివ్వమనేనా.

భిక్షువు:-అబ్బే పసిబిడ్డ దానికేమిటితెలుసు! "భయం వేస్తోంది బాబా! దగ్గిరగా పడుకోమంటోంది"—నీకేమీ అపద రానివ్వను. వాగ్దానం చేస్తున్నాను. ఇలారా ఈ తివాసీమీద కూర్చో...అలా క్రింద కూర్చుంటావేం?—ఇలా ఇక్కడ కూర్చో.

'వద్దు లెద్దూ', అని నేలమీదే కూర్చుంటాడు, మోకాళ్ళమీద తలవాల్చి. గజగజలాడుతూ వుంటాడు.

భిక్షువు:-చాలా అలజడిగావుంది నీమనస్సు; కొంచెంసేపు ఇలా పడుకుని కన్నుమూయి- స్థాయి చిక్కుతుంది.

వ్యక్తి:-నాకేం నిద్రయ్యా! దేవుడా! ఆకలిచిచ్చు నా కడుపులో కుములుకుపోతుంటేను. అన్నాడు.

భిక్షువు, చరాల్న, "ఏమిటీ! భోజనం చెయ్య లేదూ?" అని ప్రశ్నించాడు.

వ్యక్తి:-భోజనంలేదు- నా శ్రార్ధంలేదూ. నాలుగురోజులైంది బొక్కెడుకూడు నాకడుపులోపడి-ప్రేగులు మాడిపోతున్నాయి. ఒళ్లు తెలియకుండాపోతోంది నాకు. నేను చచ్చిపోతున్నానట్లేవుంది.......

భిక్షువు:-అయ్యో నాయనా! నాల్గురోజులైందా భోజనం చేసి. ఇప్పుడు అన్నంతింటే డొక్కలో నొప్పి వస్తుందేమో- పళ్లు తెస్తానుండు.

వ్యక్తి:-నిజంగానా!

భిక్షువు:-వస్తాను—

అని లోపలికి వెళ్తాడు.

అవ్యక్తి బౌద్ధవిగ్రహం ముందున్న కుందులవంక దదేకధ్యానంగా చూస్తూ, "వెండివి", అనుకుంటాడు.

భిక్షువు ఒక పళ్లెంనిండా పళ్లు, రాగిచెంబుతో మంచినీళ్లు తీసుకునివచ్చి, ఆ వ్యక్తిముందు పెట్టి, 'ఇవిగో పుచ్చుకో' అంటాడు.

అతడు ఊపిరి సలపకుండా గబగబా కుక్కుకుంటూ వుంటాడు.

భిక్షువు:-అంత తొందర దేనికి—నెమ్మదిగా తిను-భయం లేదు.

వ్యక్తి:-భయంకాదు—ఆకలి. ఆ పాపిష్టి నరకంలో ఏవేళప్పుడు పాదంపెట్టానో- ఇలా కడుపునిండా తినేందుకు నోచుకోలేదుగదా. ఒక్కనాడేనా.

భిక్షువు:-నరకమా!

వ్యక్తి:-నరకమా- మళ్లీ మాట్లాడితే యమకూపమా.

ఉత్త స్మశానం. నాశనం. కొండచిలువలు పిల్లులు

చేసే పాతాళబిలం. అబ్బబ్బా! అవన్నీ జ్ఞాపకం తేకు- అవి తల్చుకుంటే ఇప్పుడుకూడా నావొళ్లు జలదరిస్తోంది——

భిక్షువు:-అక్కడేముంటాయి.

వ్యక్తి:-ఏముంటా యేమిటి- అన్నీ వుంటాయి——ఈగలుంటాయి, దోమలుంటాయి, నల్లులుంటాయి, తేళ్లుంటాయి, జెఱ్ఱులుంటాయి, మండ్రగబ్బలుంటాయి.

భిక్షువు:-ఇంకా?

వ్యక్తి:-ఇంకా--కత్తులుంటాయి, ఈటెలుంటాయి, బరిసెలుంటాయి, బల్లేలుంటాయి, కొరడాలుంటాయి, సంకెళ్లుంటాయి.

భిక్షువు:-ఇంకా యేముంటాయి?

వ్యక్తి:-చెటేల్, చెటేల్ మని మ్రోగే కొరడాదెబ్బలుంటాయి--చుఱ్ఱుచుఱ్ఱున అంటుకునే పేబెత్తపు చరుపులుంటాయి.

భిక్షువు:-ఇంకా?

వ్యక్తి:-కూడూ నీళ్ళూ లేకుండా, డొక్కలు డోలుమంటూ, కుసిల్లి కుసిల్లి, కుమిలిపోయే చివుకు ప్రాణాలుంటాయి- కొట్లనిండా. కనికరం ఎరగని యములాళ్లుంటారు, అంపరాకాసు లుంటాయి, ఇనుపముక్కు కాకులుంటాయి——మనుష్యులమంటూ——

భిక్షువు:-ఆ! ఇంకా ఏముంటాయి.

వ్యక్తి:-అసలే కూడూ నీళ్లు లేకుండా అల్లాడుతూండే చివుకు ప్రాణుల్ని, ముక్కోణాలమీద విరిచికట్టి, పిరుదులమీద గుడ్డతీసేసి——దీన్నేనా నాగరికత అని ఏడుస్తారు మీరంతాను——స్పృహతప్పి కూలిపోయేదాకా, దెబ్బమీద దెబ్బ, పిరుదులమీద వుండే చర్మం తుక్కుతుక్కై, పత్తిపత్తై రక్తాలు ఓడిపోయేదాకా చఱ్ఱుచఱ్ఱున జబిరే పేబెత్తపు చఱుపులుంటాయి——

అల్లా జబురుతూవుంటే, తుక్కుతుక్కైన ఆ పిరుదులమీదనుంచి, చిన్న చిన్న మాంసపుముక్కలు రక్తం ఓడుతూ ఆ బెత్తాలవెంట లేచి, దూరదూరంగా పోయి పడి గిలగిలా కొట్టుకునే భీభత్సదృశ్యాలుంటాయి——ఇంకా,

భిక్షువు:-అబ్బబ్బా! ఆపు. చెప్పకు ఇక వినలేను.

వ్యక్తి:-ఏమిటీ! వినలేవ్వూ! బుద్ధివంతుడివి——చూడగలవ్?

భిక్షువు:-చూడగలననికాదు అసమర్థత——ఇంకా కాసిని వళ్లు తేనా?

వ్యక్తి:-చాలు. కడుపు నిండింది. ఇక చాలు. కాసిని మంచినీళ్లు త్రాగుతాను.

మంచినీళ్లు త్రాగి, 'ఇవ్వాళ నాప్రాణం నిలిపావు. నాలుగురోజులనుంచీ యేం పర్లాడుతున్నాను, బొక్కెడు మెతుకులు దొరుకుతా యేమోనని.

భిక్షువు:-ఆ నరకంలో ఎన్నాళ్ళున్నావు నీవు?

వ్యక్తి:-ఏడేళ్లు.

భిక్షువు:-అమ్మయ్యో! ఏడు సంవత్సరాలే.

వ్యక్తి:-ఏడుసంవత్సరాలేమిటీ——అసలు యావజ్జీవం అందులో తగలడమని నాకు శిక్ష.

భిక్షువు:-అంత ఘోరంగా శిక్షింపబడేటందుకు ఏం చేశావు నీవూ.

'ఖూనీ' అన్నాడు ఆ వ్యక్తి. స్తబ్ధంగా కరుణానందుడు దద్దరిల్లిపోయాడు. 'ఖూనీ?' అని ప్రశ్నించాడు. అతని వాక్కులో భయ విస్మయాలు రెండూ ఒకదానొకటి అక్రమించున్నాయి.

"అవును, ఖూనీ," అన్నాడు ఆ వ్యక్తి నిర్లక్ష్యంగా.

భిక్షువు:-ఎంత భీభత్సకార్యం చేశావు——నీ మనస్సంత పాషాణంగా ఎందుకు చిట్టంగట్టి పోయింది?——

వ్యక్తి:-ఈ నరకాన్ని అనుభవించటం చేతనే.

భిక్షువు:-అంటే?

వ్యక్తి:-కొన్నాళ్లపాటా నరకబాధల్ని కళ్ళారాచూచి అను

భవించేసరికి, క్రమేణా నా మనస్సు రాయిగా గనీభవించిపోయింది. పరుల కష్టాలుచూచి సహించే శక్తి నాలో కలిగింది. దాంతో నేనొక రాక్షస్సుణ్ణయిపోయాను. ఇప్పుడట్లాటి ఘోరం చేయమన్నా చేయగలను—కనికరం అనేది నాలో నశించిపోయింది.

భిక్షువు:-నీ మనస్సును కొంత స్వాధీనంలో వుంచుకోవలసింది.

వ్యక్తి:-కబుర్లు చెబుతావు—కొన్నాళ్లపాటూనరకంలో నిన్ను పారేస్తే తెలుస్తుంది నీ తమాషా. నాకంటే పిశాచానివిగా మారిపోతావు, నువ్వు. ఒకప్పుడు నామనస్సు నీ మనస్సుకంటే చాలా మెత్తందే ననుకుంటాను.

భిక్షువు:-అసలు మొట్టమొదటిసారి నిన్నా నరకంలో ఎందుకు వేశారు.

వ్యక్తి:-ఆ సిప్పులన్నీ మళ్ళా ఇప్పుడు చెరగమంటావు దేనికి?

భిక్షువు:-వింటాను.

భిక్షువు ప్రశాంత వదనాన్ని తదేకధ్యానంగా చూసి,ఆప్యాయ పడతాడు, ఆ వ్యక్తి.

భిక్షువు:-ఏమిటీ?

వ్యక్తిగా:-నిన్ను చూస్తుంటే నాలో ఏవో కొత్త క్రొత్త ఆశలు పుడుతున్నాయి. నా మనస్సు నాలోనుంచి లేచి నీ దగ్గరకు వచ్చేస్తోంది. నాదుఃఖం తగ్గితగ్గిపోతోంది. నా క్షోభ నీతో చెప్పుకోవాలనిపిస్తోందే నాకు

భిక్షువు:-చెప్పు; వింటాను...

ఆవ్యక్తి తన జీవితకథను చెప్పేటందుకు యిలా ఉపక్రమించాడు.

"మా అమ్మగారు చచ్చిపోటంతోటే మా బాబయ్య మరి మంచంపట్టారు. నాల్గుమాసములు తీసుకుని ఆయనకూడా చనిపోయారు. నాకు పదహారవ సంవత్సరం. ప్రపంచ జ్ఞానం ఏమీ లేదనుకోవచ్చు. ఇంట్లో కానీ లేదు. నేను నిరుద్యోగంలోపడి తన్నుకు చస్తాను"

"పాపం చాలా చిక్కుల్లోనే పడ్డావు." అన్నాడు భిక్షువు.

"ఆ! చిక్కులేమిటి. ఇల్లాంటి వాటికైతే నేనసలు లక్ష్యపెట్టేవాణ్ణేగాదు. మరో పెద్దబెడద ఎవరెస్టు పర్వతంలా నా నెత్తినబడ్డది. దాంతో చితికిపోయాను?

"అయ్యో! పాపం! ఏమిటది?"

"మాబావ మాఅక్కయ్యను, అయిదుగురు పిల్లలను వొదిలేసి దేశాంతరం వెళ్ళిపోయాడు.

"దారుణం!"

"ఆ సంసారాన్నంతా నేనే పోషించవలసివచ్చింది. ఇక చూడు నా అవస్థ.

"ఒకొక్క దఫా పిల్లాజల్లా మేమంతా, మూడేసి రోజులు, నాలుగేసిరోజులు, నిరాహారంగా వస్తుండేవాళ్ళం.

"ఒకసారి ఇలానే నాలుగురోజులు తిండిలేక మలమల మాడిపోయాము. నా చిన్న మేనల్లుడు పసిబిడ్డ నాభుజానపడుకుని, "మామయ్యా! ఆకలేస్తోంది," అన్నాడు. ఒక కన్నీటిబిందువు, ఆ బిడ్డ కనుకొలకుల వెంట జారి నా బుగ్గమీదపడి క్రిందికి ప్రవహించింది."

"ఇక ఆగలేకపోయాను. మా పొరుగువాళ్ల కోడిపెట్టను పట్టుకున్నాను— రహస్యంగా. సంతకు తీసుకుపోయి, ఆరణాలకు అమ్మి వాటితో నూకలు కొంటున్నాను—రాజభటులువచ్చి నన్ను పట్టేశారు—ఆరుమాసాల కఠినశిక్ష అని తీర్పు.

"ఈ స్వల్ప నేరానికే!" అన్నాడు. భిక్షువు.

"స్వల్పమేమిటి గిల్పమేమిటి నిరంకుశత్వానికి.—

"ఆ ఆరుమాసాలూ ఈ నరకాన్ని అనుభవించేసరికి నాలో విపరీతమైన మార్పులు కలిగాయి. పాపానికి

పుణ్యానికీ నాకేమీ భేదం కనుపించలేదు. పై పెచ్చు పాపం పుణ్యాన్ని అణగత్రొక్కేసి నిరంకుశత్వం అనే పేరుతో పిశాచ తాండవం చేస్తుందనికూడా గ్రహించాను.

"నాగుండె రసహీనమై పాషాణంగా మారి పోయింది. పాపభీతి చాలావరకు నశించిపోయింది.

"విడుదలై నతర్వాత?" అని ప్రశ్నించాడు, భిక్షువు.

మళ్ళా యిలానే తిండిలేక మలమల మాడటం ప్రారంభించాను. వెనుకటికి మల్లేకాదు నేనప్పుడు. నాలో వున్న పశుత్వం బలిష్ఠమై దేవత్వాన్ని బొత్తుగా పీక నులిమేసింది. రాక్షసిని నేనప్పుడు. ఆ ఆకలిమంటల్ని అణచుకునే శక్తిలేదు నాలో అప్పుడు.—

"ఒక ధనికుడి ఇంటికి కన్నంవేశాను-కట్టుబడ్డాను-మూడు సంవత్సరాలన్నారు—"

"అయ్యయ్యో! అంతకంతకు దించుకు పోతు నావ్ను" అన్నాడు భిక్షువు.

"ఆ మూడుసంవత్సరాలూ ఆ యమ బాధల్లో మెలిగి ఒక పిశాచంగా బయటికివచ్చాను.

"మావూరు వచ్చీరావటంతోటే, ఏం జరిగిందో తెలుసునా?—ఒక ధనికుడు రెండువందలు నాకిచ్చి ఒక మనిషిని చంపమన్నాడు—అవి పుచ్చుకుని పని పూర్తి చేశాను!

"ఎంత దారుణకృత్యం చేశావు," అని భిక్షువు చికాపడుతున్నాడు.

"ఆ ధనికుడు లంచంపెట్టి తప్పుకున్నాడు—నాకు యావజ్జీవం కఠిన వరకం.—

"మొన్ననే కొట్లోనుంచి తప్పించుకుని పారిపోయి వచ్చేశాను—స్వేచ్ఛగా ఈ గాలిని పీల్చుకునేందుకు కూడా నోచుకోలేదుగదా నేను"

భిక్షువు కళ్ళనీళ్ళ పర్యంతం అయినాడు.

"ఎందుకూ ఏడుస్తున్నావ్?" అన్నాడా వ్యక్తి.

భిక్షువు గద్గదంగా, "అలా నిండుప్రాణాన్ని తీసేందుకు నీకు చేతులెల్లా వచ్చాయి—నీకు అలాంటి భయంకరమైన శక్తి ఎలా కలిగింది?—"

"ఈ నరకాన్ని అనుభవించటం చేతనేనని చెప్పటం లేదుటయ్యా?"

"కొంచెం మనస్సును స్వాధీనంలో వుంచుకోవలిసింది."

"విద్యా విహీనుణ్ణి."

"నిజమే—పోనీ ఇకనైనా నా దయారసాన్ని పొందుతావా?"

ఆ వ్యక్తి భయంకరంగా నవ్వుతూ, 'ఆహాహా! నాకేందయ—నేనొక పెద్దపులి నయిపోయాను' అన్నాడు.

భిక్షువు, 'అవతల జీవిలోనూ నీవంటి ప్రాణమే వున్నదనుకో, అహింసాదేవత నిన్నా వేసించుతుంది', అని నెమ్మదిగా బ్రతిమలాడినట్టుగా చెప్పాడు.

ఆ వ్యక్తి భిక్షువుముఖాన్ని తేరిపార జూచి, కలవరంగా, 'ఇదిగో! నీ వెవడో మతస్థుడవల్లే వున్నావే. నాకేదో క్రొత్తమతం ఇయ్యాలని వుందల్లేవుంది నీకు?—'

'మత మేమిటి- మానవుణ్ణి- మానవమతం నాది', అన్నాడు భిక్షువు.

ఆ వ్యక్తి భిక్షువుమాటలు వినిపించుకోకుండానే, "పోపోదూ, అవతలికి—మీ మతస్థుల మాటలు వింటే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది. మీరు పొన్నకాయల్లా తిని కూర్చుని, మేం కూడూ గుడ్డాలేక మలమల మాడి చస్తూవుంటే, "శాంతి!" "అహింస!" అంటూ ఏమిటో ఉపన్యాసాలు కొడతారు. ఆ ఘోష నాముందు తీసేయ్. నేను వినలేను- ఆ వెధవ ఘోష'.

'ఆచరించకపోతే మానె,—వింటే నేం?'

విసుగుతో చరాల్న నేలను తన్ని 'నే విననన్నాను కాదూ' అన్నాడు ఆ వ్యక్తి.

'పోనీలే- చాలా ప్రొద్దుపోయింది. కాసేపు స్థిమితంగా పడుకుని నిద్రపో.

'నేనుమటుకు చస్తే పడుకోను'.

'ఏం?'

'అమ్మో! నన్ను పట్టివ్వటానికేం?'

'ఇదుగో ఇలా రా——' అని చేతులుజాపి కావిలించుకుంటాడు. 'నామీద నీకింకా నమ్మకం లేదు కదూ!'

'వుంది- ఏమిటో భయంగా వుంది' అంటాడు ఆ వ్యక్తి పసిబిడ్డలా.

'నీకేం భయం లేదు పడుకో స్థిమితంగా. నిన్ను కనురెప్పలా కప్పి కాపాడుకుంటాను. భయం లేదు పడుకో'.

పసిబిడ్డలా నెమ్మదిగా వెళ్లి పడుకుంటాడు

దేవదత్త పక్కమీద పడుకుని 'బాబా! నాకు భయం వేస్తోంది. నాదగ్గిర బజ్జోవూ? అంటుంది.

'అలానే. ఇంకా మేలుకునేవున్నావూ నిద్రపోలేదూ?' అని బిడ్డదగ్గరకువెళ్లి వెనక్రపక్కను పడుకుంటాడు. ఇద్దరూ వుత్తరీయం కప్పుకుంటారు. భిక్షువు నిద్రపోతాడు. బిడ్డ మధ్య మధ్య కళ్లువిప్పి ఆ నూతన వ్యక్తిని చూస్తూవుంటుంది.

* * *

ఆ వ్యక్తి నెమ్మదిగా లేచి, బుద్ధవిగ్రహం ముందర వున్న, ఆ రెండు జ్యోతులూ వూదేస్తాడు. ఆ కుందులలో వున్న నూనె క్రింద పారబోసేస్తాడు. ఆ కుందుల్ని సంగ్రహించి నెమ్మదిగా బయటికి జారతాడు.

పిల్ల దీన్నంతా కనిపెడుతూవుంటుంది——ఖంగారుగా 'బాబా! బాబా! లే! దొంగ! పారిపోయాడు', అంటూ కరుణానందుణ్ణి కొట్టి లేపుతుంది.

భిక్షువు లేచి 'ఏమిటి అమ్మడూ?' అంటాడు ప్రశాంతంగా.

'మరే, ఇం దాకటిదొంగే, బుద్ధదేవుల ముందున్న వెండికుందులు రెండూ ఎత్తుకు పారిపోయాడు'.

'అయ్యో, పాపం' అంటాడు జాలిగా.

'పాపమేమిటి- పుణ్యం- మన కుందు లెత్తుకు వాడు పరారీ అవుతుంటేను!'

'ఈ మాత్రానికి ఈ రాత్రివేళ చీకట్లో పరారి కావటం దేనికి. అవి తనకు కావాలంటే నే నిచ్చేవాణ్ణి కానూ? అన్నాడు భిక్షువు.

బిడ్డ కొంటెతనంగా రెండు చెంపలమీదా రెండు చేతులూ వేసుకుని, 'అయ్యో పాపం', వాడికి తెలియదు కామల్నండీ!——మరికొన్ని అడిగి పుచ్చుకోవలిసిందీ——నాకూ తెలియదు సుమండీ లేకపోతే నేనన్నా, చెప్పేదాన్ని మరికొన్ని అడిగి పుచ్చుకోమని——'

భిక్షువు 'కొంటెబుజ్జి' అంటూ ఎత్తుకు ముద్దాడుతాడు. పోయి తలుపు గొళ్లెంవేసి వస్తాడు. ఇద్దరూవెళ్లి మళ్లా పడుకుంటారు.

బిడ్డ, "కుందులుపోతే పోయాయిగాని——వెధవ కుందులు పీడా విరగడయింది బాబూ- ఇక హాయిగా పడుకోవచ్చు" అని ఉత్తరీయం కప్పుకుంటూ వుంటుంది.

'అంత భయమెందుకే పిచ్చితల్లీ!' అని కౌగలించుకుంటాడు భిక్షువు.

"ఏమో బాబూ అలాంటి రాక్షసిముండా వాళ్లని చూస్తే మా ఆడవాళ్ళకి భయం వేస్తుంది."

"మా ఆడవాళ్లు! పెద్ద పేరక్కవయినావు" అంటూ, ముద్దువచ్చి ఆ బిడ్డచెక్కిలి తన చెక్కిలికివేసి నొక్కుకుంటాడు.

* * *

తలుపుకొట్టిన చప్పుడౌతుంది.

"ఎవరువారు" అంటాడు భిక్షువు——బిడ్డ భయపడి భిక్షువు డొక్కలో దూరుతుంది.

తలుపు వెనకనుంచి, "మేం రాజభటులం—స్వామి వారితో మాట్లాడాలి" అని జవాబు

భిక్షువు పక్కదిగి బిడ్డవంక చూచి "రాజభటులు వచ్చారు, కిక్కురుమన్నావా—ముక్కు కోసేస్తారు. పిల్లికూనలా పడుకో" అని చెప్పి వెళ్ళి తలుపుతీస్తాడు. బిడ్డ నిశ్శబ్దంగా పడుకుంటుంది.

రక్షకభటుడు ప్రవేశించుతాడు. "ఏమిటి?" అంటాడు కరుణానందుడు. రక్షభటుడు రెండు వెండికుందులు జేబులోనుంచితీసి "ఇవి చూడండి వీటిమీద తమ నామధేయం చెక్కివున్నాయి" అని భిక్షువు చేతిలో పెడతాడు.

భిక్షువు, "అవును—ఇవి నావే—వీటిని నేనొక మిత్రుడికిచ్చి ఇప్పుడే పంపాను—కొంపతీసి అతణ్ణి బంధించావా ఏమిటి దొంగదొంగని?......ఏమిటి మాట్లాడవ్ బంధించావా...దుర్మార్గం—బీదసాదలు దొరుకుతారు మీరు వేపుకు తినడానికి—పద నాకిప్పుడతణ్ణి చూపాలి."

ఇరువురు రక్షకభటులు ఆ వ్యక్తిని లోపలికి తీసుకువస్తారు.

భిక్షువు ఆ వ్యక్తిని సమీపించుతూ "బాబూ" ఇలారా! ఉదయం వెళ్లుదువు గానంటే, వినకుండా ఈ అర్ధరాత్రి బయలుదేరావు చూచావా?

రక్షకభటులు "సెలవు దయచేయించండి" అని వెళ్ళిపోతారు.

ఆ వ్యక్తి భిక్షువుకు ఎదురుగా నుంచుని పసిబిడ్డలాగు గుబులుగుబులుగా ఏడుస్తాడు.

"ఎందుకూ."

"ప్రభూ! ప్రభూ!" అని కాళ్లుపట్టుకుని గొల్లుమంటాడు.

భిక్షువు:-ఏమిటిది భీరూ?

వ్యక్తి:-నన్ను నీవు ఉరికంబంమీదికి పంపితే నేను నిశ్చింతగా వెళ్ళేవాణ్ణి; నాలో నాకే అగ్నిని ప్రజ్వరిల్లజేసి నన్ను కాలుస్తున్నావు. ఈ మంటలు నేను భరించలేను.

భిక్షువు:-హాలాహలం చల్లారి అమృతం పుడుతుంది. ఇది సముద్ర మథనం. నీ సత్ప్రవర్తనకు నేను హామీవుండి నీకు విడుదలవచ్చే యేర్పాటు చేస్తాను. నీవు నిశ్చింతంగా వెళ్లు. ఇవిగో వీటిని తీసుకుపో.

అని వెండికుందులు అతనిచేతిలో పెట్టబోతాడు.

వ్యక్తి:-ప్రభూ! ప్రభూ! ఈ అనంతజ్యోతి సామీప్యాన్ని విడిచిపెట్టి నన్ను మళ్లా చీకటిలోకి పొమ్మంటావా. నేనీ పాదాలు వదల్ను.

భిక్షువు:-గౌతమదేవులు నీకురక్ష! ఆ జ్యోతులు వెలిగించి స్వామికి నమస్కరించు.

ఆ వ్యక్తి మళ్ళా కుందులు యథాస్థానాన్న ఉంచి వెలిగించుతాడు. సాష్టాంగంచేసి, "నమో శ్రీబుద్ధాయ" అంటాడు.

భిక్షువు వెనకనుంచి "జయ్ శ్రీబుద్ధాయ," అంటాడు.

బిడ్డ పక్కమీదనుంచి లేచివస్తూ, పాడుతుంది.-

జయ గౌతమాయదేవ
శాంతి ప్రదాతదేవ
లోకైవ వంద్యదేవ
జయభరత పుత్రదేవ.

అంతా "జయ్ శ్రీబుద్ధాయ" అంటారు. ఆ విహారపు శిలలన్నీ కూడా "జయ్ శ్రీబుద్ధాయ" అని ప్రతిధ్వనించుతాయి.